తల్లీపిల్లలు అదృశ్యం

అదృశ్యమైన తల్లీపిల్లలు(ఫైల్)

కాచిగూడ, జనవరి 16 : భర్తతో గొడవ పడి ముగ్గురు పిల్లలతోపాటు భార్య అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం... చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సాయి కృష్ణ భార్య సునీత(39)సాయికృష్ణ, సునీత దంపతుల సంతానం చైత్ర(11) 7వ తరగతి, త్రిలోచన్(9) 4వ తరగతి, మానిశ్(7)2వ తరగతి చదువుతున్నారు. నల్లకుంట డివిజన్‌లోని గాంధీనగర్(లంక)లో నివసించే తమ్ముడు విజయ్ బాబు ఇంటికి ఈనెల 4వ తేదీన పిల్లలతో కలిసి సునీత వచ్చింది. 7వ తేదీన ఇంటికి వెళ్తున్నట్లు తమ్ముడికి చెప్పి చిక్కడపల్లికి వెళ్లలేదు. తల్లీపిల్లలు ఇప్పటికి తిరిగి రాకపోవడంతో తమ్ముడు విజయ్ బాబు, భర్త, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో వెతికారు. దీంతో తమ్ముడు విజయ్‌బాబు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కవులు, కళాకారుల ప్రోత్సాహానికి
ఎగ్జిబిషన్ సొసైటీ కృషి

అబిడ్స్, జనవరి 16: కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ నిరంతరం కృషి చేస్తుందని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి బి.హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్ పేర్కొన్నారు. 46 రోజులపాటు కొనసాగే ఎగ్జిబిషన్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కవులు, కళాకారులకు తగిన విధంగా సొసైటీ ఆధ్వర్యంలో సహకారాలు అందిస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రసిద్ధ సాహితీవేత్త, భారత కళారత్న వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనం అందరిని అలరించింది. ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల ఆజేందర్ కుమార్ కళాకారులను సత్కరించి అభినందించారు. సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, సలహాదారులు గులామ్ అహ్మద్, కన్వీనర్ ఎం. హైదర్ పాల్గొన్నారు.

నిలిచిన వడ్డెర బస్తీ థీమ్ పార్కు పనులు

- స్థలాన్ని తమకే కేటాయించారంటున్న ఎక్సైజ్ శాఖ
- భవన నిర్మాణాలకు పనికి రాదంటున్న జీహెచ్ఎంసీ
- సమన్వయ లోపంతో ముందుకు సాగని పనులు

వడ్డెరబస్తీ పార్కులో పిల్లర్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

ముషీరాబాద్, జనవరి 16 : శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా అడిక్‌మెట్ వడ్డెరబస్తీ పార్కులో నిర్వహించ తలపెట్టిన థీమ్ పార్కు పనులు ముందుకు సాగడం లేదు. జీహెచ్ఎంసీ, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల మధ్య స్థలం కేటాయింపు విషయంలో సమన్వయం లేక థీమ్ పార్కు పనులు ముందుకు సాగడం లేదు. వడ్డెర బస్తీ పార్కు స్థలం తమకు కేటాయించారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతుంటే.. కాదు ఇదివరకే పార్కుగా అభివృద్ధి చేసినందున కొత్తగా థీమ్ పార్కు ఏర్పాటు చేసుకునే అవకాశం తమకే ఉందంటూ జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. దీంతో వడ్డెర బస్తీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన థీమ్ పార్కు అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. స్థలం కేటాయింపునకు సంబంధించి రెవెన్యూ శాఖ స్పష్టతనివ్వకపోవడం వల్ల ఇటు జీహెచ్ఎంసీ, అటు ఎక్సైజ్ శాఖల మధ్య వివాదం తలెత్తి అభివృద్ధి పనులు జరగడంలేదు. రెవెన్యూ శాఖకు చెందిన స్థలాన్ని గత ఆరేండ్ల కిందట కలెక్టర్ ముషీరాబాద్, కాచిగూడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ భవనాలు నిర్మించుకోవడానికి కేటాయించారు. అయితే నిర్మాణ పనులు చేపట్టడానికి మట్టి వదులుగా ఉండటంతో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ భవనాలు నిర్మించడం సాధ్యం కాదని నిపుణులు తేల్చారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు తాము అధునాతన హంగులతో థీమ్ పార్కు ఏర్పాటు చేస్తామంటూ ముందుకు వచ్చారు. గత ఏడాది కిందట కోటి రూపాయల బడ్జెట్ కేటాయించి థీమ్ పార్కు పనులు మొదలు పెట్టారు. పనులు మొదలయ్యేటప్పుడు చోద్యం చూసిన ఎక్సైజ్ శాఖ అధికారులు పునాది నిర్మాణ పనులు పూర్తయ్యాక అభ్యంతరం తెలిపారు. దీంతో దాదాపు సంవత్సర కాలంగా థీమ్ పార్కు పనులు ముందుకు సాగడం లేదు. మరోవైపు ప్రతిపాదిత ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల భవనాల ఏర్పాటు పనులు అడుగుముందుకు వేయడం లేదు. దీంతో పార్కు పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలమయంగా మారిపోయింది. అంతేకాదు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

వడ్డెరబస్తీ థీమ్ పార్కు స్థల కేటాయింపు విషయమై స్పష్టత వచ్చే వరకు పనులు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులు కోరారు. దీంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖకు లేఖ రాశారు. స్థలాన్ని ఎక్సైజ్, పీహెచ్‌సీలకు కొంత కేటాయించిన నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చిన తరువాత పనులు చేపడుతాం.

- విశ్వేష్, ఏఈ, జీహెచ్ఎంసీ సర్కిల్-15

■ మాజీ మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కాలేరు

మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిలను కలిసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు కవితారావులు కూడా మాజీ మంత్రులను కలిశారు.

బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పవిత్రానగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జనవరి 16 : రాంనగర్ డివిజన్ దాయర మార్కెట్, పవిత్రానగర్‌లో మంగళవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. బస్తీల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు గాను స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన బస్తీల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ఇటీవల డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ, నాయకులు దామోదర్ రెడ్డి, ఎర్రం శేఖర్, ముదిగొండ మురళీ, దీన్ దయాల్‌రెడ్డి, వి.సుధాకర్‌గుప్త, శ్రీధర్‌చారి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు

గాలిపటం ఎగురవేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య పార్కులో పతంగి ఎగురవేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

పతంగులను అందజేస్తున్న కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, జనవరి 16: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ గాలిపటాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి గౌడ్, కోశాధికారి సరిగిరి కిరణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి.రాజులు, బీఆర్ఎస్ నాయలకు ఆర్.జయదేవ్, రాజు, మహేశ్, వాకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్రాతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు గాలిపటాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, మంగమ్మ, హన్మంతు, అభిషేక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చైనా మాంజాపై అధికారులు చర్యలు తీసుకోవాలి

వినియోగదారుల కమిషన్ కోశాధికారి ప్రకాశ్ విన్నపం

నాంపల్లి కోర్టులు, జనవరి 16(నమస్తే తెలంగాణ): వ్యాపారులు, ప్రజలు వాడొద్దని నిషేధించిన చైనా మాంజాపై అధికారులు కొరడా ఝుళిపించాలని హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ బార్ అసోసియేషన్ కోశాధికారి కనుకుంట్ల ప్రకాశ్ విన్నవించారు. సంక్రాంతి సంబురాల్లో గాలిపటాల పట్ల పెరుగుతున్న గిరాకీ అంతా ఇంతా కాదని, మాంజాల తయారీకి వ్యాపారులు చేస్తున్న వ్యతిరేక కార్యకలాపాలపై అధికారులు నిఘా వేయాలన్నారు. మాంజా తయారీకి వాడుతున్న రయనాలు, ప్లాస్టిక్, గాజుముక్కల సరఫరాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు.ఆదివారం దేశానికి సేవలందిస్తున ఆర్మీ జవాన్ వెంకటేశ్వర రెడ్డి చైనామాంజా గొంతుకు తగిలి మరణించిన ఘటన అందరినీ కలచివేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఇలాంటి కేసులు నమోదవుతూనే ఉన్నాయని, చైనా మంజాకు బలికాకుండా ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఘనంగా ముగిసిన మల్లన్న జాతర

హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్

కవాడిగూడ, జనవరి 16: భోలక్‌పూర్‌లోని బకారంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో ఈనెల 14 నుంచి ప్రారంభమైన శ్రీ మల్లికార్జున స్వామి(మల్లన్న) జాతర మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి ఊర్మిళా అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఒగ్గు పూజారీ బాబురావు నేతృత్వంలో ఆలయ పూజారి మధుసూదన చారిల సమక్షంలో మూడు రోజులపాటు జరిగిన ఈ బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్

శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ తదితరులు హాజరై మల్లన్నకు తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం రాంపురం రాజనర్సింగ్ రావు, ఉమామహేశ్వరిల సమక్షంలో భక్తులకు అన్నదానం చేశారు.

బాకారం మల్లిఖార్జున్ స్వామి దేవాలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, పక్కన మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, అంజిరెడ్డి, బి.మనోహర్‌సింగ్, లింగాల శ్రీకాంత్ గౌడ్, పాశం అనిల్‌కుమార్ తదితరులు

- ముషీరాబాద్, జనవరి 16

■ ముగిసిన సంక్రాంతి ఉత్సవాలు

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్‌మిల్ ఇందిరానగర్ వద్ద ఉన్న తిరుపల్లి గడ్డ శ్రీకోవెల రంగనాయక స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ ఈవో శ్రీనివాస రాజు పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం రంగోలి పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ ప్రతినిధులు జనార్దన్, నర్సింగ్‌రావు, గుంటి విజయ్‌బాబు, కోయల్ కార్ శ్రీనివాస్, ఎన్.శ్రీకాంత్, జగన్నాథం, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- మెహిదీపట్నం, జనవరి 16

రెజ్లింగ్ విజేతకు సన్మానం

తమిళనాడులో ఇటీవల జరిగిన 11వ సౌత్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ 2023-24లో బంగారు పతకాన్ని సాధించిన నాంపల్లి నియోజకవర్గం బజార్‌ఘాట్‌కు చెందిన సయ్యద్‌అబు హురెరాను మంగళవారం ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభినందించారు. యువత క్రీడల్లో దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకురావాలన్నారు.

- మెహిదీపట్నం, జనవరి 16

■ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు అభివృద్ధిని అందించాలన్నారు.

- మెహిదీపట్నం, జనవరి 16

ముగ్గులేసి..ప్రతిభ చాటి

గోల్నాక కర్కానాలైన్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

కాచిగూడ, జనవరి 16 : సంకాంత్రి పండుగను పురస్కరించుకుని నల్లకుంట డివిజన్‌లోని గోల్నాక కర్కానాలైన్‌లో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యావతి, పి.రమాదేవి, లక్ష్మి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రత @సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖాన

- కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో పరిశుభ్రతా చర్యలు
- గర్భిణులు ఇబ్బందుల్లేకుండా నిరంతర పటిష్ట చర్యలు

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఆవరణలో శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సుల్తాన్‌బజార్, జనవరి 16 : కొవిడ్-19 జేఎన్-1 వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వ దవాఖానలలో వైద్య చికిత్సలు పొందుతున్న రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పారిశుధ్య చర్యలను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు మరింత ముమ్మరం చేశారు. దవాఖానలలో పూర్తిస్థాయిలో నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా ఆయా దవాఖానల పాలకవర్గం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానకు నిత్యం వందల మంది గర్భిణీలు ఓపీకి వచ్చి పోతుండటంతోపాటు ఇన్ పేషెంట్‌లుగా ఉన్న గర్భిణీ, బాలింతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి పూర్తిస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దవాఖానలోని లేబర్ వార్డుతో పాటు ఆపరేషన్ థియేటర్, వార్డులు, ఓపీ బ్లాక్‌తోపాటు పైకప్పులపై చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపర్చడంలో పారిశుధ్య కార్మికులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. దవాఖానలో డ్రైనేజీలు పొంగిపొర్లితే జీహెచ్ఎంసీ సిబ్బంది రాక కోసం వేచి ఉండక సిబ్బందే స్వయంగా తగిన జాగ్రత్తలు తీసుకొని పరిశుభ్రపర్చారు.

గర్భిణులకు ఇబ్బందుల్లేకుండా..

కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అతి సున్నితంగా ఉండే గర్భిణులకు ఇబ్బందులు కలుగకుండ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గర్భిణీ రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దవాఖానలోనే అన్ని రకాల రక్త పరీక్షలు చేసే విధంగా అత్యాధునిక యంత్రాలను సమకూర్చారు. ఈ యంత్రంతో ఒకే సమయంలో 150 మంది రోగులకు రక్త పరీక్షలు చేయొచ్చని ఆమె తెలిపారు. సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నారు. దవాఖానలోని లేబర్ రూమ్, వార్డులతోపాటు ఆవరణలోని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్య సిబ్బందితో ఆవరణలో ఎక్కడ కూడా చెత్తచెదారం లేకుండా రసాయనాల పిచికారితో శానిటైజ్ చేస్తున్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న జి.శ్రీనాథ్ గౌడ్

చిక్కడపల్లి, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. మంగళవారం కనుమ సందర్భంగా గోద అమ్మవారి కరినోమ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వ్యవస్థాపక వంశీయుడు కుమారుడు జి.శ్రీనాథ్ గౌడ్, ఈవో కార్యక్రమాలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భక్తులను పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా నగరంలో ప్రసిద్ధి చెందిన వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కిస్తున్నట్లు దేవాలయం ఈవో దేవనాథం తెలిపారు.

సుధాకర్‌కు స్వామి వివేకానంద సేవా పురస్కారం

అబిడ్స్, జనవరి 16 : పాతబస్తీ లాల్‌దర్వాజ నివాస ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆస్పత్రిలో గత 30 ఏండ్లుగా హెర్బలిస్టుగా వైద్య విద్యార్థులకు సేవలందిస్తున్న పోసాని సుధాకర్ ముదిరాజ్‌కు నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ద్వారా స్వామి వివేకానంద సేవ పురస్కారం-2024 ఎన్నిక చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ బత్తుల హేమంత్ తెలిపారు. సుధాకర్ ఆయుర్వేద మొక్కల యొక్క వాటి ఉపయోగాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద ఆస్పత్రిలో సేవలందిస్తూ గత 8 ఏండ్లుగా లాల్ దర్వాజా మహంకాళి దేవాలయ సింహవాయిని అధికారిక పోతురాజు కూడా సేవలు అందిస్తున్నారు. అబిడ్స్‌లోని బొగ్గుల కుంటలో గల తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఈనెల 19న శుక్రవారం 10గంటల నుంచి జరిగే స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, తెలంగాణ శాసన మండలి సభ్యులు బొగ్గారపు దయానంద్ గుప్తా, ప్రముఖ చలన చిత్ర హీరో, మాజీ మంత్రి డాక్టర్ బాబుమోహన్ తదితరులు పాల్గొని అవార్డులు ప్రదానం చేస్తారన్నారు.

ప్రాచీన కళలకు చేయూతనివ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, జనవరి 16 : అంతరించిపోతున్న ప్రాచీన కళలు మన దేశ సాంస్కృతిక సంపదని, ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, నాట్య గురువులపైన ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు-2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురు చిన్నారి నాట్య కారిణులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు బహూరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రాజేందర్, దైవజ్ఞశర్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు వీరేష్ యాదవ్ పాల్గొన్నారు. సభకు ముందు నాట్య కారిణులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యకార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

కూచిపూడి నాట్యకారులకు జ్ఞాపికలు బహూకరిస్తున్న ఆర్.కృష్ణయ్య

బీసీల హక్కులు అణిచివేస్తున్న మోదీ ప్రభుత్వం

మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ, జనవరి 16 : బీసీలకు రావాల్సిన హక్కులను కల్పించకుండా మోదీ ప్రభుత్వం అణిచివేస్తుందని, మోదీ ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరి అవలంభిస్తుందని, బీసీల తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచి, కులాల వారీగా తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బజరంగ్‌దళ్ ఆగ్రహం

సుల్తాన్‌బజార్, జనవరి 16 : అయోధ్య రాముడి పాదాల నుంచి వచ్చిన అక్షింతలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోఠిలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కరీంనగర్‌లో ఓ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి హోదాలో బాధ్యతాయుత పదవిలో ఉండి అవి అయోధ్య అక్షింతలు కావు రేషన్ బియ్యం అని పొన్నం ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అక్షింతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం హిందువులకు వెంటనే క్షమాపణ చెప్పాలని బజరంగ్‌దళ్ డిమాండ్ చేస్తుందన్నారు. లేని పక్షంలో మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నేడు తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

అంబర్‌పేట, జనవరి 16 : కాచిగూడ డివిజన్ పరిధిలోని నింబోలిఅడ్డా, రామకృష్ణ హాస్పిటల్ లేన్‌లో ఈనెల 17వ తేదీ బుధవారం నూతన తాగునీటి తాగునీటి పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు ఈ ప్రారంభ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



శ్రీనివాస్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

చిక్కడపల్లి, జనవరి 16 : కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐలీ ప్రభాకర్, సభ్యులు బాబి, రవి యాదవ్, సురేందర్ గౌడ్, రణధీర్ రెడ్డి,మధు, సత్యనారాయణ, మల్లేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.